## కథ

కొల్లూరి సోమశంకర్

# పాపులర్ సుబ్బారావ్

సుబ్బారావుకి ఉన్నట్లుండి దురద పుట్టింది. వంటికి కాదండోయ్! మనసుకి. పదిమంది తనని గుర్తించాలనీ, పొగడాలనే తాపత్రయం ఎక్కువైపోతోంది. క్రిందటి నెలలో వాళ్ళ దూరపు బంధువొకాయనకి 'పర్యావరణ మిత్ర' అనే అవార్డు వచ్చినప్పటి నుంచి అతడికి మనశ్శాంతి కరువయింది. అప్పటి నుంచి తెగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆఫీసులోనేమో తన సెక్షన్‌లో తప్ప తనని గుర్తుపట్టేవాళ్ళు లేరు. ఇంటి దగ్గరేమో కనీసం రెండిళ్ల అవతలివాళ్లకైనా సుబ్బారావు ముఖం కూడా తెలియదు.



రాత్రి భోజనం అయ్యాక తన అభిమాన డైలీ సీరియల్ సైతం చూడకుండా సోఫాలో దిగాలుగా కూర్చున్న సుబ్బారావుని–

''ఏమైందండీ? అలా ఉన్నారు!'' అని అడిగింది వాళ్లావిడ సరళ.

''ఏం చేస్తే నాక్కూడా పేరొస్తుందో అని ఆలోచిస్తున్నాను'' నిట్టూరుస్తూ అన్నాడు సుబ్బారావు.

''ఇప్పటికే కాలనీ ప్రెసిడెంట్‌గా ఉన్న తలనొప్పులతో ఛస్తుంటే మీ గొడ వేంటండీ బాబూ! ఈ రోజు సాయంత్రం కాలనీలోని ఆడవాళ్లంతా మనింటి దగ్గర గొడవ చేశారు. దాని గురించి మీకే మాత్రం పట్టదు''

''ఎందుకట గొడవ, చెత్త తీయించడం గురించేనా?''

''అవును. మీకు చేతనైతే దాన్ని పరిష్కరించండి. అప్పుడు మీకు కూడా బోలెడు పేరు ప్రతిష్ఠలొస్తాయి''

''మంచి ఆలోచన సరళా, రేపట్నించే ప్రయత్నాలు మొదలు పెడతాను'' ఉత్సాహంగా చెప్పి నిద్రకి ఉపక్రమించాడు సుబ్బారావు.

వాళ్ల కాలనీలో సమస్య పేరుకుపోతున్న చెత్త. కాలనీల నుండి చెత్త సేక రించకపోవడం, తమ ప్రాంతాలలో చెత్తని డంప్ చేయడాన్ని శివారు ప్రాంతాల ప్రజలు వ్యతిరేకించడం వల్ల చెత్త నిల్వలు పెరిగిపోయాయి. ప్రజలు ఫిర్యాదు చేస్తుంటే ''మాకు సంబంధం లేదు. చెత్త తరలించే బాధ్యత కాంట్రాక్టర్లదే, వాళ్లని అడగండి'' అని అంటున్నారు మునిసిపల్ శాఖాధికారులు.

ఈ కారణంగా పౌరులకి, మునిసిపల్ సిబ్బందికి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇదీ కాలనీ వాసుల ఆందోళనకి కారణం

హైదరాబాద్ నగరమంతా ఉద్రిక్తంగా ఉంది. మతకలహాలేం జరగలేదు. కానీ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అసలు విషయం తెలియనివారికది చాలా చిన్న సమస్యగా తోస్తుంది. కానీ సమస్య తీవ్రత తెలిసినవారు మాత్రం భయపడుతున్నారు. ఈ చెత్త కుప్పలు మరీ ఎక్కువైపోవడం వల్ల ప్లేగు వంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకవచ్చని, చెత్త నుండి వెలువడే విష వాయువులు ప్రజలని ఉక్కిరిబిక్కిరి చేయవచ్చని కేంద్రం హెచ్చరించడంతోనూ, మరో ఎనిమిది నెలల్లో ఎన్నికలు ఉండడంతోను రాష్ట్రప్రభుత్వంలో కదలిక వచ్చింది.

ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతోను సమావేశం ఏర్పాటు చేశాడు. 'చెత్త నిర్వహణ, మురికినీటిని శుద్ధి చేయడం' కోసం తీసుకోవలసిన చర్యలతో తగిన ప్రణాళిక రూపొందించి వారం రోజులలో పనులు మొదలుపెట్టాలని ఆదేశించాడు. సమావేశం ముగిసాక, ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తమ కింది సిబ్బందికి బదలాయించారు.

ఆఫీసయ్యాక, సుబ్బారావు ఎక్కిన 'సెక్రటేరియట్– ఆఫీస్ స్పెషల్' బస్సు టాంకుబండ్ మీదుగా వెడుతోంది. హుస్సేన్ సాగరంతా చెత్తతోను, దుర్గంధంతోను నిండి వుంది. టాంకుబండ్ మొదలు నుంచి చివరి వరకు అందరూ ముక్కు మూసుకుని కూర్చున్నారు. ఇదేమి పట్టని సుబ్బారావు, సెక్షన్ ఆఫీసరు తనకు అప్పజెప్పిన కొత్త బాధ్యత గురించి ఆలోచిస్తూ ఇల్లు చేరాడు. తను వ్యక్తిగతంగా చేద్దామనుకున్న పనినే, అధికారికంగా అప్పజెప్పేసరికి సుబ్బారావు ఆనందానికి అంతు లేకుండా పోయింది. విషయమంతా భార్యకి హుషారుగా వివరించాడు.

''ఇప్పుడింతకీ ఏం చేయాలనుకుంటున్నారు?'' అడిగింది సరళ.

''రాష్ట్రం మొత్తం మీద మునిసిపాలిటీలలోనూ, కార్పొరేషన్లలోను మొత్తం ఎంత చెత్త తయారవుతోంది? వాటిని ఎలా నిర్వహిస్తున్నాం? ఏం చేస్తే ప్రజల ఆరోగ్యానికి ముప్పు తప్పుతుంది? వగైరా వివరాలతో రెండు రోజుల్లోగా ఓ రిపోర్టు తయారుచేసి మా ఎస్ఓకి అందివ్వాలి.''

''ఓహో! అంత తేలికైన విషయం కాదు.''

ఇంతలో కాలేజీ ఫీజు గురించి తండ్రిని డబ్బులడుగుదామని అక్కడ కొచ్చిన వాళ్లబ్బాయి రాజు ''ఏంటమ్మా తేలికైన విషయం కాదంటున్నావు? దేని గురించి?'' అని అడిగాడు.

ఆంధ్రప్రదేశ్ మొత్తంలో ఒక రోజులో ఎంత చెత్త తయారవుతుందో లెక్క కావాలంటూ సరళ వివరించింది.

''అంతేనా గూగుల్‌లో సెర్చి చేస్తే సరి'' అంటూ వెళ్లి కంప్యూటర్ ఆన్ చేసి, ఇంటర్నెట్‌లో వెతకసాగాడు రాజు. కాసేపయ్యాక తిరిగి వచ్చి 'నాన్నా, ఏ సైట్ లోనూ ఇటువంటి వివరాలేవీ లేవు. పోనీ సమాచార హక్కు చట్టం కింద అడగవచ్చేమో కనుక్కో' అని అన్నాడు.

అసలే కంగారుగా ఉన్న సుబ్బారావుకి ఈ సలహాతో మరింత చిర్రెత్తుకొచ్చింది.

''నువ్వు నోరుమూసుకోరా'' ఏం చెయ్యాలో నేను చూసుకుంటాను. నీ ఫీజు సంగతి రేపు చూద్దాం'' అంటూ లేచి ఫోను దగ్గరకి వెళ్లాడు. కానీ రాజు అక్కడి నుంచి కదల్లేదు.

సుబ్బారావు తనకు తెలిసిన కాంట్రాక్టర్లందరికి ఫోన్ చేసాడు. ఎలాగైతేనేం. తనకి కావలసిన వివరాలు ఉజ్జాయింపుగానైనా రాబట్టాడు.

''ఇంతకీ ఒకరోజులో మన రాష్ట్రం మొత్తం మీద ఎంత చెత్త వస్తోందండీ?'' సరళ అడిగింది ఆసక్తిగా.

''రాష్ట్రంలోని మునిసిపాలిటీల నుంచి కార్పొరేషన్ల నుంచి ఒక రోజులో సుమారుగా 11,24,000 కిలోల చెత్త వస్తోంది.'' ఆసంఖ్య విని కళ్లు తేలేసింది సరళ.

''హమ్మయ్య చెత్త ఎంత తయారవుతోందో తెలిసింది. ఈ చెత్త సరిగ్గా నిర్వహించకపోవడం వల్ల గాలి విషపూరితం అవుతోందట. ఒక గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్ తగ్గించే మార్గం ఏదైనా వెదకాలి...''అన్నాడు సుబ్బారావు.

''నాన్నా, ఓ ఐడియా, అమెరికా మావయ్య వాళ్ల కంపెనీ ఆ మధ్య ఏదో పరికరం కనిపెట్టింది కదా.. అదేమైనా మనకి ఉపయోగపడుతుందేమో మావయ్యని అడుగుదాం..'' అన్నాడురాజు.

''నిజమేరోయ్. పద. నెట్‌లో చూద్దాం. మావయ్య ఆన్‌లైన్‌లో వున్నాడేమో. వుంటే వివరాలు కనుక్కుందాం'' అంటూ లేచాడు సుబ్బారావు. ముగ్గురు కంప్యూటర్ దగ్గరకి చేరారు. అదృష్టవశాత్తు రాజు వాళ్ల మావయ్య ఆన్‌లైన్‌లో


వధూవరుల ఫోటోలు చూపించకుండా ...
సరైన సంబంధాన్ని కుదుర్చటమే కాకతీయ ప్రధాన లక్ష్యం

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్చీస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ – 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999


శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION

www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com

వున్నాడు. ఛాటింగ్ చేసి తనకి కావలసిన వివరాలు కనుక్కొన్నాడు సుబ్బారావు.

''రేపొద్దున్న మా ఆఫీసు నుంచి మాబాస్‌తో మాట్లాడిస్తాను. మీకు రాత్రవుతుందిగా ఫరవాలేదా?'' అడిగాడు సుబ్బారావు.

''బిజినెస్‌కి అవకాశం వుందంటే, అమెరికా వాళ్లకి రాత్రికి పగలకి పెద్ద తేడా వుండదు బావా. నో ప్రాబ్లమ్. నువ్వు మా ఆఫీసుకి ఫోన్ చెయ్యి. నేనొక ఈ-మెయిల్ ఐడి ఇస్తాను. దానికి ఇప్పుడే మెయిల్ చెయ్యి...'' చెప్పాడు బావమరిదికి.

అతడికి థాంక్స్ చెప్పి, అతడి ఐడికి తన సమస్యని వివరిస్తూ మెయిల్ పంపాడుసుబ్బారావు.

□□□□□

మర్నాడు ఉదయం ఆఫీసుకి వెళ్లగానే తను సేకరించిన సమాచారాన్ని ఎస్ఓకి వివరించాడు సుబ్బారావు. 12 గంటలకి అమెరికా కంపెనీతో వీడియో కాన్ఫరెన్స్ పెడితే, ఆ పరికరం ఎలా పనిచేస్తుందో 'డెమో' చూపిస్తారని చెప్పాడు. చకచకా ఏర్పాట్లు జరిగిపోయాయి. ముఖ్యమైన అధికారులందరూ సమావేశమయ్యారు. అమెరికా కంపెనీ ప్రతినిధులు లైన్లోకి వచ్చారు. తాము కొత్తగా రూపొందించిన పరికరం పనిచేసే విధానాన్ని తెరపై చూపించారు. ఆ పరికరంలో ఓ రసాయనాన్ని పోసి, దాన్ని కార్బన్ డై ఆక్సైడ్ ఎక్కువగా వున్న ఓ గదిలో వుంచారు. ఆ పరికరం వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ని పీల్చేసుకొని ద్రవీకృతంగా మార్చుకొని, కార్బన్ డై ఆక్సైడ్ లేని వాయువుని బయటకి వదిలింది.

''అద్భుతం! ప్రస్తుతం మనకి కావలసింది ఇలాంటి పరికరమే'' అని అరిచాడు ఎస్ఓ. ఉన్నతాధికారులు కూడా అంగీకరించినట్లే కనపడ్డారు. ఏ సంగతి త్వరలోనే చెబుతామంటూ కాన్ఫరెన్స్ ముగించారు. సుబ్బారావు ఇతర అధికారులు హాయిగా నిట్టూరుస్తూ 'హమ్మయ్య' అని అనుకున్నారు. ఈ విషయమంతా ఆరోగ్య శాఖా మంత్రికి, ఆర్థిక శాఖా మంత్రికి నివేదించారు. అయితే సుబ్బారావు ఊహించనట్లుగా ఈ వ్యవహారం ఇక్కడితో ముగియలేదు. చెత్తలో ఎక్కువగా వుండేది మిథేన్ వాయువని ఆరోగ్యశాఖ, హైదరాబాదు నగరంలోని ప్రతి ఇంటికీ లేదా రాష్ట్రం మొత్తానికి ఆ పరికరం అందించాలంటే తమ వల్ల కాదని ఆర్థికశాఖ ఈ ప్రతిపాదనకి అడ్డుచెప్పాయి. వేరే మార్గాలు చూడాలంటూ మునిసిపల్ శాఖని కోరాయి. సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

□□□□□

అయితే అనూహ్యంగా రెండు రోజల తరువాత అమెరికా కంపెనీ ప్రతినిధులు సుబ్బారావు ఆఫీసుకి ఫోన్ చేశారు. రాష్ట్రంలోని చెత్తనంతా క్వింటాళ్ల లెక్కన కొంటామని తగిన ధర చెల్లించగలమని చెప్పారు.

''అంత చెత్త మీరేం చేసుకుంటారు?'' అడిగాడు ఎస్ఓ.

''ప్రాసెస్ చేసి ఎరువుగా మార్చుకుంటాం.''

''సర్లేండి... మీరేం చేసుకుంటే మాకెందుకు? అప్లికేషన్ పెట్టండి. టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ పంపిస్తాం. ఒప్పందం కుదిరాక, చెత్తని పంపిస్తాం.'' వాళ్లు అంగీకరించారు. వెంటనే అప్లికేషన్ పంపారు. తర్జన భర్జనల తర్వాత ప్రభుత్వం ఒప్పుకుంది.

అంతే, ఒక్కసారిగా రాష్ట్రంలోని డంపింగ్ యార్డ్‌లకి, చెత్తకుప్పలకి మోక్షం కలిగింది. కంటైనర్ల నిండా చెత్తతో విమానాలు, నౌకలు అమెరికాకి ప్రయాణమయ్యాయి. రెండు నెలల్లో హైదరాబాద్ అత్యంత పరిశుద్ధమైన నగరంగా మారిపోయింది.

ఓ రోజు సుబ్బారావు బావమరిది అమెరికా నుంచి ఫోన్ చేశాడు.

''ఏం బావా? మీ చెత్త సమస్య తీరిందా?''

''ఆ... మీ కంపెనీ దయ వల్ల.''

''అలా అనకు బావా. మీదయ వల్లే, దివాళ అంచున వున్న మా కంపెనీ కోలుకుంది. పైగా నాకు ప్రమోషన్ కూడా దొరికింది.''

''అదేంట్రోయ్?''

''అవును బావా. మీ దగ్గర నుంచి చెత్తని తక్కువ ధరకి కొని, బ్రిటన్‌లో ఇంకో కంపెనీకి ఎక్కువ ధరకి అమ్ముతున్నాం.''

''అంత చెత్తను వాళ్లు మాత్రం ఏం చేసుకుంటారు?''

''బావా, వాళ్లు చెత్త నుంచి ఇటుకల లాంటి 'బిటుబ్లాక్'తయారు చేస్తున్నారు. అవి కాంక్రీటుకు ప్రత్యామ్నాయం. పైగా తక్కువ ఖర్చుతో కాంక్రీటు కన్నా దృఢమైన పదార్థాం సిద్ధం చేసుకుంటున్నారు. వాటినే మళ్లీ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇళ్ల నిర్మాణానికి అమ్ముతున్నారు. మీ చెత్త వలన అందరికీ లాభమే కలిగింది. అదిసరే గానీ, ఈ వివరాలని బయటకు పొక్కనీకు. జాగ్రత్త. ఇక వుంటా...''

''సరేలేరా..'' అంటూ ఫోన్ పెట్టేశాడు సుబ్బారావు.

□□□□□

అయితే సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే ఓ టీవీ ఛానెల్ వాళ్లు ఈ రహస్యాన్ని బహిర్గతం చేశారు. మన ప్రయోజనాలను విదేశీ కంపెనీకి తాకట్టు పెట్టడం సబబేనా అంటూ ఎస్ఎంఎస్ ఓటింగ్ పెట్టిందా ఛానెల్. అమెరికా కంపెనీకి దాసోహమం టున్నామంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. అసెంబ్లీని స్థంభింపచేశాయి. అవకాశం కోసం ఎదురు చూసే నాయకులు ఉద్యమానికి సిద్ధమయ్యారు. అధికార పార్టీ ముఖ్య నేత బావమరిది స్వయంగా ఈ ఉద్యమానికి నేతృత్వం వహించసాగాడు. ఇది ప్రజా ఉద్యమమని, ఉందులో రాజకీయాలకు తావు లేదని ప్రకటన చేసాడు. ''చెత్త మనది. సొత్తు ఇంకొకడిదా? వీల్లేదు. చెత్త ఎగుమతులు ఆపండి. రాష్ట్రాన్ని రక్షించండి'' అనే నినాదాలతో హైదరాబాదులో ప్రారంభమైన కొత్త ఉద్యమం రాష్ట్రమంతా వ్యాపించింది. దీని ధాటికి ఇతర ఉద్యమాలన్నీ వెనకపడ్డాయి.

''ఊరు మనదిరా. చెత్త మనదిరా.. వాడ మనదిరా... తుక్కు మనదిరా..'' అనే పాటలతో నగరం హోరెత్తిపోయింది. సుబ్బారావు పేరు రాష్ట్రమంతా మారుమ్రోగిపోయింది. చాలా ఊర్లకి వెళ్లి ఉపన్యాసాలు ఇవ్వవలసి వస్తోంది. అతడి ఇంటర్వ్యూలు, అతడితో ముఖాముఖీ కార్యక్రమాలెన్నో ప్రసారం చేసాయి. టీవీ ఛానెళ్లు అంతే. సుబ్బారావు వీర పాపులర్ అయిపోయాడు.

ఎన్నికల సమయం కావడంతో,రాజకీయం మరీ వేడెక్కింది. చెత్తని ప్రభుత్వమే కొనాలనీ, దానికి తగిన మద్దతు ధర చెల్లించాలని ఓ పార్టీ డిమాండు చేసింది. ఇంకో పార్టీ మరో అడుగు ముందుకేసి తాము అధికారంలోకి వస్తే చెత్తని ప్రజల నుంచి నేరుగా కొంటామని, అవసరమైతే ప్రజల ఇంటి దగ్గరే డబ్బు చెల్లిస్తామని ప్రకటించింది. దాంతో ప్రజలు చెత్తని బయట పారేయడానికి వెనకాడుతున్నారు. వేరే రాష్ట్రాలలో వుండే బంధువుల ఇళ్ల నుంచి చెత్తని పార్శిళ్లలో తెప్పించుకొని నిల్వ చేస్తున్నారు. జనాలు, చెత్త ఏరుకోవడానికి ఎవరైనా వెడితే తరుముతున్నారు. ఓ కంపెనీ చెత్తని కనీసం మూడురోజుల పాటు కుళ్లిపోకుండా వుండేలా ఓ పిచికారీ మందు తయారు చేసింది. రాష్ట్రం అల్లకల్లోలమైపోయింది.

ముఖ్యమంత్రికి చిర్రెత్తి ఓ విచారణా సంఘాన్ని నియమించాడు. వాళ్లు త్వరత్వరగా విచారించి దీనికంతటికి మూలకారణం సుబ్బారావని తేల్చి, అతడిని సస్పెండ్ చేయాలని సూచించారు. అయితే ప్రజల క్షేమం కోరి తానా సలహా ఇచ్చానని సుబ్బారావు విన్నవించుకోగా, కనికరించి వదిలేసారు. మన శాస్త్రవేత్తలు అటువంటి పరికరాలను కనిపెట్టేవరకు, అమెరికా కంపెనీకి ఎగుమతులు ఆపేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

మళ్లీ నగరం, రాష్ట్రం చెత్తతో కళకళలాడసాగాయి. నెల రోజుల తర్వాత కొన్ని వాన్లు మూడు రోజులకు ఒకసారి వచ్చి అన్ని చోట్ల చెత్తని కొంటున్నాయి. సుబ్బారావు వాళ్ల కాలనీ సమస్య, అతడి కీర్తి కాంక్ష రెండూ తీరాయి. అయితే, సామాన్య ప్రజలకి తెలియని రహస్యమల్లా- బినామీ పేరుతో అధికార పార్టీ ముఖ్యనేత బావమరిది, నగర శివార్లలో చెత్త నుండి విద్యుత్తు తయారుచేసే ప్లాంటు పెట్టడం.!

కొసమెరుపు ఏంటంటే తెలుగు ప్రజలకి సుబ్బారావు చేసిన సేవలను గుర్తించిన ప్రతిపక్ష పార్టీ, అతడిని నగర మేయర్ పదవికి పోటీ చేయించాలని ప్రతిపాదించడం.

★